సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 14 | సెప్టెంబర్ | 2023



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి వేగేశ్న వీఎస్‌కేడీఎన్ సోమరాజు, సరస్వతి దంపతులు బుధవారం రూ.లక్ష విరాళం అందించినట్లు ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,200,పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

డిజిటల్ వెలుగులు



డిజిటల్ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతోంది. కూరగాయల నుంచి కంప్యూటర్ వరకు ఏ వస్తువు కొనుగోలు చేసినా ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ ఇంటి పన్నులను కూడా ఆన్‌లైన్ ద్వారా కట్టించుకుంటోంది. ఇప్పుడు విద్యుత్ బిల్లులను వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నారు.

8లో

న్యూస్‌రీల్

గోకులం నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



అప్పనపల్లిలో గోకులానికి విరాళం అందజేస్తున్న సత్యనారాయణ దంపతులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో నూతనంగా నిర్మించే గోకులం భవన నిర్మాణానికి ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందిన చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు బుధవారం రూ.రెండు లక్షలు విరాళం అందించారు. ఈ మొత్తాన్ని వారి కుటుంబ సభ్యులు కూనపరెడ్డి సత్యనారాయణ, సూర్యకుమారి దంపతులు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, బొరుసు పార్వతిదుర్గాభవానీలకు అందించారు. గోకులం నిర్మాణానికి రూ.5 లక్షలు అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఈ మొత్తాన్ని చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. మొదటి విడతగా రూ.రెండు లక్షలు ఇచ్చారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, పెద్దలు గెడ్డం వెంకటేశ్వరరావు, బొరుసు పండు, కంకిపాటి నరసింహారావు పాల్గొన్నారు.

కార్మికుల్ని నిండా ముంచిన 'వేవ్ ఎనర్జీ'



నిరసన తెలుపుతున్న కార్మికులు

అల్లవరం: ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్‌లోని ప్రధాన కాంట్రాక్టుదారు టాటా కంపెనీ నుంచి సబ్ కాంట్రాక్టు తీసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'వేవ్ ఎనర్జీ' కంపెనీ కార్మికుల జీతాలు చెల్లించకుండా రాత్రికి రాత్రే టెర్మినల్ నుంచి ఉడాయించింది. దీంతో బిహార్, యూపీ, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది కార్మికులు దిక్కుతోచని స్థితిలో టెర్మినల్ గేటు ముందు బుధవారం నిరసనకు దిగారు. మెకానికల్ విభాగంలో పనులు నిర్వహించడానికి టాటా కంపెనీతో వేవ్ ఎనర్జీ కంపెనీ గత డిసెంబర్‌లో ఒప్పందం చేసుకుంది. తొమ్మిది నెలలుగా పనులు నిర్వహిస్తున్న వేవ్ కంపెనీ కార్మికులకు అద్దెకు రూములు తీసి ఇచ్చింది. అయితే ఆరు నెలలుగా పీఎఫ్‌లు జమ చేయకపోవడం, రెండు నెలలుగా కార్మికులకు జీతాలు, రూము అద్దెలు ఇవ్వకుండా ఎగవేసింది. కార్మికులు జీతాలు, డీజిల్ బిల్లులు రూ.2 కోట్లు బకాయిలు పెట్టి కంపెనీ ప్రధాన ఉద్యోగులు మంగళవారం రాత్రి ఉడాయించారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులుగా మా బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదని, న్యాయం జరగకపోతే టెర్మినల్ గేటు ముందు నిరసనకు దిగుతామని కార్మికులు తెలిపారు.

సకాలంలో సర్కారు చొరవ

- కోనసీమలో కొబ్బరి కొనుగోలుకు ఉత్తర్వులు
- 16న నాఫెడ్ కేంద్రం ప్రారంభం
- వచ్చే నెల నుంచి దసరా.. ఆ తరువాత కార్తికమాసం
- ఉత్తరాదికి ఎగుమతులు పెరిగే అవకాశం
- ఇప్పుడు నిల్వలు పూర్తయితే అప్పటికి మంచి ధర



అంబాజీపేటలో సమావేశంలో మాట్లాడుతున్న ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకరరావు



మిల్లింగ్ కోప్రా

సాక్షి అమలాపురం/ అంబాజీపేట: కొబ్బరి ధరలు తక్కువ ఉన్నందున నాఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే రైతుల కోరిక మేరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు అనుమతి ఇచ్చింది. ముందుగా ఈ నెల 16వ తేదీన అంబాజీపేట మార్కెట్ యార్డులో ప్రారంభించనున్నారు. తరువాత కొత్తపేట, నగరం, తాటిపాక, ముమ్మిడివరాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. ఈ కేంద్రాల్లో మిల్లింగ్ కోప్రా (ఎండు కొబ్బరి)ను క్వింటాల్ రూ.10,860, బాల్‌కోప్రాను రూ.11,750 చొప్పున కొనుగోలు చేయనున్నారు. ఎండు కొబ్బరి, పచ్చి కొబ్బరి, ఇతర కొబ్బరి ఉత్పత్తుల ధరలు పతనమై రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేయిస్తోంది. ప్రస్తుతం ధర లేకపోవడం, రైతుల వద్ద రాశులు పేరుకుపోవడంతో వచ్చే దసరా, దీపావళికి సైతం ధరలు వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక సమయంలో సరైన నిర్ణయం తీసుకుని వీటిని ఏర్పాటు చేస్తోంది. దీనివల్ల కొబ్బరి మార్కెట్‌లో ధరలు పెరిగే అవకాశంతోపాటు పండగల సమయానికి డిమాండ్ వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

ఇదే మంచి తరుణం

- అంబాజీపేట బహిరంగ మార్కెట్‌లో ఎండు కొబ్బరి (కొత్త కొబ్బరి) క్వింటాల్ ధర రూ.8 వేలు మాత్రమే. నాఫెడ్ కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా ఉన్న కొబ్బరిని రూ.10,800కు కొనుగోలు చేయనున్నారు. అంటే బహిరంగ మార్కెట్ కన్నా రూ.2,800 అధికం. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవచ్చు.
- ప్రస్తుత మార్కెట్‌లో పచ్చికొబ్బరి వెయ్యి కాయల ధర 7 వేల వరకు ఉంది. అయితే 1,200 కాయలు కొడితే క్వింటాల్ కొబ్బరి ఉత్పత్తి అవుతుందని అంచనా. ఇందుకు రూ.8,400 అవుతోంది. క్వింటాల్ తయారీకి రూ.మూడు వేల వరకు ఖర్చవుతోందని, నాఫెడ్ కేంద్రాలకు కొబ్బరి అమ్మకాలు చేస్తే గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు.
- అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో ప్రస్తుతం తయారవుతున్న ఎండుకొబ్బరిలో దేవస్థానాల నుంచి సేకరించిన కొబ్బరి అధికం. కొబ్బరి కొట్టి తయారు చేసేవారు చాలా తక్కువ మంది ఉన్నారు.
- కొబ్బరికి బహిరంగ మార్కెట్‌లో రూ.7 వేల వరకు ధర ఉన్నా కొనుగోలు చాలా తక్కువగా ఉంది. ఎగుమతులు పెద్దగా లేకపోవడంతో వ్యాపారులు కొనుగోలు తగ్గించారు. రైతుల వద్ద రాశులుగా కొబ్బరి పేరుకుపోతోంది. ఇప్పుడు కొబ్బరి తయారు చేసి అమ్మకాలు చేస్తే రైతుల వద్ద నిల్వలు చాలా వరకు తగ్గుతాయి.
- వినాయక చవితి కొనుగోలు అయిపోయినా వచ్చే నెలలో దసరా, శుభ కార్యక్రమాలు, నవంబర్‌లో దీపావళి పండగలు ఉన్నాయి. ఈ సమయంలో కొబ్బరికి డిమాండ్ వస్తుంది. ఈ సమయంలో రైతుల వద్ద రాశులు లేకుంటే కొబ్బరికి డిమాండ్ పెరిగి మరింత ధర పలుకుతుందని అంచనా.

దళారుల ప్రమేయం లేకుండా..

నాఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో దళారుల ప్రమేయం లేకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు. గత టీడీపీ హయాంలో నాఫెడ్ కేంద్రాలు తెరచినప్పుడు టీడీపీ నేతలే దళారులుగా మారి కేంద్రాలలో అమ్మకాలను ప్రభావితం చేసేవారు. కొబ్బరి నేరుగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసేలా ప్రభుత్వం పక్కాగా చర్యలు చేపట్టింది. కొబ్బరి విక్రయించే రైతులు తమ వివరాలను ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేయాలి. అలాగే మార్కెట్ కమిటీలో నమోదు చేయించాలి.

రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు

ఎండు కొబ్బరి కొనేందుకు రెండు రోజులలో నాఫెడ్ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో బుధవారం ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఆయిల్‌ఫెడ్ ఎండీ చావల బాబురావు ఆదేశాల మేరకు నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాలను తెరవనున్నామన్నారు. ఈ కేంద్రాలను 180 రోజుల పాటు నిర్వహించాలని ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఎకరాకు 2 బస్తాలు (క్వింటాల్) చొప్పున కొనుగోలు చేయనున్నామని, రైతుల వివరాలతో పాటు, కొబ్బరి విక్రయాలకు సంబంధించి కంటిన్యూస్ మోనటరింగ్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రైసెస్ అండ్ ప్రొక్యూర్‌మెంట్ (సీఎం యాప్)లో నమోదు చేస్తామన్నారు. కొబ్బరి కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. ఎండు కొబ్బరిలో రద్దు, దుమ్ము, ధూళి. పెంకు ఒక్క శాతం మించి ఉండకూడదని, ముడతలు ఏర్పడిన కొబ్బరి, పగిలిన చిప్పలు 10 శాతం, తేమ ఆరు శాతం మించకూడదని ఆయన తెలిపారు. మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు కె.లక్ష్మీపతిరాజు, బి.ఎస్.ఎన్.కుమార్ పాల్గొన్నారు.

ముద్రగడను బూటు కాళ్లతో తన్నినప్పుడు
ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా?



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- కాపులపై అక్రమ కేసులు బనాయించినప్పుడు ఎక్కడున్నారు ?
- పింఛన్ల పంపిణీ సభలో అచ్చెన్నాయుడుపై ఎమ్మెల్సీ తోట ఫైర్

మండపేట: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందంటూ ఊగిపోతున్న టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను బూటు కాళ్లతో తన్నించినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. మహిళ అని కూడా చూడకుండా ఆయన సతీమణి, పిల్లలను తోటల్లో పరుగులు పెట్టించి కొట్టించినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని ధ్వజమెత్తారు. మండపేట సీతారామ కల్యాణ మంటపంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన బుధవారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ తోట ఘాటుగా స్పందించారు. ఉద్యమ సమయంలో అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావులతో కలిసి కాపు నేతగా తాను ముద్రగడ వద్దకు వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుతో రాజకీయంగా లబ్ధి పొందేందుకు.. ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యిందంటూ పెడబొబ్బలు పెడుతున్న అచ్చెన్నాయుడు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు ముద్రగడ ఉద్యమానికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన కాపులపై అక్రమ కేసులు బనాయించినప్పుడు ప్రజాస్వామ్యానికి గంతలు కట్టారా అని ప్రశ్నించారు. కాపులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని తాము అప్పటి సీఎం చంద్రబాబును కోరగా కొంచెమైనా కనికరం చూపించారా అని అడిగారు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవే కేసులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనస్సుతో కొట్టేశారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. అరిచి గీపెట్టినంత మాత్రాన చంద్రబాబు చేసిన స్కాంలో వాస్తవాలు మరుగున పడిపోవని హితవు పలికారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, కోర్టు పరిధిలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. పేదల పక్షపాతిగా పనిచేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందజేశారు. పార్టీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, సత్తి వెంకటరెడ్డి, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా పాల్గొన్నారు.

పేదల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష

కలెక్టర్ హిమాన్షు శుక్లా



సీఎం జగన్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నూపుర్ అజయ్, అధికారులు

అమలాపురం రూరల్: పేదలందరికీ ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి 26 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష అమలు తీరును సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మొదటి దశలో వలంటీర్లు, గృహసారథులు ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశ్రీ సేవల వివరాలపై అవగాహన కల్పించాలని, ఆరోగ్యశ్రీ అనుబంధ ఆసుపత్రుల జాబితాతో కూడిన వివరాలు అందించి ఆయా వైద్య సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి ఇంటిలో ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి, స్థానిక ఏఎన్‌ఎంలకు తెలియజేయాలన్నారు. రెండవ దశలో ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు ఇంటింటికీ వెళ్లి అవసరమైన వారికి సుగర్, బీపీ, రక్త పరీక్షలు చేసి, వివరాలను సిటిజన్ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. శిబిరాల నిర్వహణ సమయానికి వారి హెల్త్ రిపోర్ట్ సిద్ధం చేస్తారని, ఈ నెల 8న ఉచిత శిబిరాల నిర్వహణ తేదీలను ఎంపీడీవోలు విడుదల చేశారన్నారు. ఈ నెల 15 నుంచి గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 16 నుంచి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌ల పరిధిలోని గృహాలను ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు సందర్శించాలన్నారు. ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా టోకెన్లు జారీ చేయాలన్నారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 31 వరకు 56 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. జేసీ ఎస్. నూపుర్ అజయ్, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, డీఈఓ ఎం.కమలకుమారి అదనపు డీఎంఅండ్ హెచ్ఓ భరత్‌లక్ష్మి, ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుమలత, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ఆద్రోస్, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి పాల్గొన్నారు.

సత్వరం సమస్యల పరిష్కారం

- అధికారులకు జేసీ ఇలక్కియా ఆదేశం
- జగనన్నకు చెబుదాంలో 39 వినతులు



జేసీ ఇలక్కియాకు వినతిపత్రమిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత, పాలక వర్గ సభ్యులు

తాళ్లరేవు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం తాళ్లరేవు మండలంలో నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జేసీ హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. తాళ్లరేవు మండలంలో ఉన్న చమురు సంస్థలు చెల్లించే సీఎస్ఆర్ నిధుల్లో సుమారు రూ.10 కోట్లను ఏటా మండల పరిషత్‌కు కేటాయించాలని ఎంపీపీ రాయుడు సునీత, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పలువురు ఎంపీటీసీ సభ్యులు జేసీకి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని జేసీ చెప్పారు. ఇంజరంలో వంతెన కూలిపోవడంతో పంటకాలువకు తాత్కాలికంగా తూములు వేశారని, అవి చెత్త చెదారాలతో మూసుకుపోవడంతో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణమే వంతెనను పునర్నిర్మించాలని జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు కోరారు. జి.వేమవరం పంచాయతీ రామాలయంపేట ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు నిధులను హెచ్‌ఎం దుర్వినియోగం చేశారని, దేనికి ఖర్చు చేశారో కనీసం లెక్కలు చెప్పడం లేదని స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీపాదం శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఇంజరం గ్రామానికి చెందిన విత్తనాల శ్రీను గత ఏడాది మృతిచెందాడని, కానీ వైఎస్సార్ బీమా ఇప్పటివరకు రాలేదని, ఇప్పించాల్సిందిగా అతని భార్య వీరవేణి కోరింది. తాళ్లరేవు జెల్లావారి పేటలో గ్రామ కంఠం భూమిని కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని, ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికుడు నేరేడిమిల్లి త్రిమూర్తులు వినతిపత్రం అందజేశారు. కోరంగి పంచాయతీలో ఉన్న రొయ్యల ప్రాసెస్ ప్లాంట్లు, కంపెనీల నుంచి వచ్చే వ్యర్థ జలాల కారణంగా కాలుష్యం పెరిగిపోవడంతోపాటు ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, కాలుష్యాన్ని నియంత్రించాలని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పాలెపు పోశియ్య వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలో ఉన్న వందలాది ఎకరాల అసైన్డ్ భూములను పలువురు ఆక్రమించుకున్నారని, వాటిని పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని పలువురు లబ్ధిదారులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో 39 వినతులు వచ్చినట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు తెలిపారు. ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, డీఆర్‌ఓ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతో
మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI DIGITAL MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు … గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా… అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతిసిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా… మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా… ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే… దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకురావడం మాత్రం మరచిపోవద్దేం! జిల్లా స్పాన్సర్‌గా శ్రీ షిర్డి సాయి విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నారు.

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా :

సర్ సీవీరామన్ స్కూల్
పోలీస్ స్టేషన్ వెనుక,
నారాయణపేట, అమలాపురం

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9010224454

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board


District sponsor


SRI SHIRDI SAI GROUP OF EDUCATIONAL INSTITUTIONS RAJAHMUNDRY KADIYAM website : www.sssjc.in

పారదర్శకంగా ఓటర్ల జాబితా

అమలాపురం రూరల్: ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి అంశంలో పర్యవేక్షణ జవాబుదారీతనంతో రూపొందిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 ప్రక్రియలోని అంశాలపై డీఆర్‌ఓ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరును కచ్చితంగా ఇంటింటి సర్వే ద్వారా గుర్తించి ఓటు హక్కును కల్పించడంతో పాటుగా సర్వేలో ఓటరుగా స్థానికంగా నివాసం ఉంటున్నదీ లేనిదీ పరిశీలించి నిర్ధారిస్తామన్నారు. బీఎల్‌వో తో పాటు రాజకీయ పార్టీ నియమించిన ఏజెంట్ కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం వహించడంతో జవాబుదారీతనం కలిగిన ఓటరు జాబితా రూపొందుతుందన్నారు. స్వీకరించిన ప్రతి ఒక్క దరఖాస్తు బీఎల్ వోలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. నియోజక వర్గ సహాయ ఎలక్టోరల్ అధికారి వ్యక్తిగత పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తస్మై నకారాయ నమశ్శివాయ





మురమళ్ల వీధులలో రుద్రాక్షలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, పండితులు, ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

ఘనంగా వీరేశ్వరునికి లక్ష రుద్రాక్షల అర్చన

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం ఓం నమఃశివాయ అంటూ శివనామ స్మరణతో మార్మోగింది. శ్రావణమాసం మాసశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా సాగాయి. ప్రముఖ శైవ క్షేత్రం కాశీ నుంచి తెచ్చిన లక్ష రుద్రాక్షలను ఊరేగింపుగా మేళతాళాలతో పవిత్ర వృద్ధ గౌతమీ నదికి తీసుకువెళ్లారు. అక్కడ పూజలు, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం వినాయకుని పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్ష రుద్రాక్షలతో పూజలు నిర్వహించారు. స్వామివారికి పూజా కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు రుద్రాక్ష విశిష్టత, కలిగే ఫలితాలపై అర్చకులు చేసిన ఉపన్యాసం భక్తులను ఆకట్టుకొంది. అనంతరం మంత్రపుష్పం, పండిత ఆశీర్వచనం జరిగింది. పూజాకార్యక్రమాల అనంతరం స్వామివారిని రుద్రాక్షలు, మారేడు బిల్వాలు, పచ్చిపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ రుద్రాక్ష పూజా కార్యక్రమాన్ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తిలకించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం, రుద్రాక్షలు అందించారు. పూజా కార్యక్రమాలు తిలకించేందుకు వచ్చిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పరిశీలించారు.

క్లుప్తంగా

వైద్య ఆరోగ్యశాఖ పోస్టుల భర్తీలో ప్రొవిజినల్ జాబితా విడుదల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగానున్న పోస్టుల భర్తీలో భాగంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా వివరాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వైద్య సేవల సమన్వయకర్త ఎం.సనత్‌కుమారి బుధవారం తెలిపారు. ఈ నెల రెండు నుంచి ఎనిమిదో తేదీ వరకు వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగానున్న పోస్టులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీటికి సంబంధించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఈస్ట్‌గోదావరి.నిక్.ఇన్ వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ లిస్టులు అందుబాటులో ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా రిక్రూట్‌మెంట్ 2023 ఏపీవీవీపీ అనే జీ మెయిల్, కొవ్వూరు ఆసుపత్రిలోని ఆసుపత్రుల సేవల సమన్వాయాధికారి కార్యాలయంలోను తగిన ఆధారాలతో సమర్పించాలన్నారు. తర్వాత వచ్చిన అభ్యంతరాలు పరిశీలించబోమన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా వెబ్‌సైట్‌లో పొందుపర్చుతామన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో పొందుపర్చిన గ్రీవెన్స్‌లోనే దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో వాటిని పరిగణలోకి తీసుకోమన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ రోడ్డులోని పిట్లవానిచెరువులో సుమారు 45ఏళ్ల మహిళ మృతదేహం తేలిఆడుతున్న ఘటన బుధవారం మధ్యాహ్నం సంచలనమైంది. పోలీసుల కథనం ప్రకారం పిట్లవానిచెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం తేలి ఆడడంతో స్థానికులు బొమ్మూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఎస్సై వెంకయ్య పరిశీలించారు. మృతదేహం బాగా ఉబ్బిపోవడంతో గుర్తుపట్టనివిధంగా ఉంది. దీంతో పోలీసులు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై వెంకయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహిళ వివరాలు తెలిసిన వారు 0883–2434173 ఫోన్ నంబరులో తెలియజేయాలని ఎస్సై వెంకయ్య కోరారు.

డిజిటల్ వెలుగులు

- ఆన్‌లైన్ ద్వారా 88 శాతం విద్యుత్ బిల్లుల చెల్లింపు
- రెండేళ్లలోనే 58 శాతానికి పెరుగుదల
- వినియోగదారులకు సమయం, డబ్బు ఆదా

రాయవరం: డిజిటల్ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతోంది. కూరగాయల నుంచి కంప్యూటర్ వరకు ఏ వస్తువు కొనుగోలు చేసినా ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ ఇంటి పన్నులను కూడా ఆన్‌లైన్ ద్వారా కట్టించుకుంటోంది. ఇప్పుడు విద్యుత్ బిల్లులను వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నారు. గతంలో విద్యుత్ శాఖలో బిల్లుల చెల్లింపులు, నూతన విద్యుత్ సర్వీస్ కనెక్షన్, అదనపు లోడ్ కోసం నగదును మాన్యువల్‌గా అందజేసేవారు. మూడేళ్లుగా విద్యుత్‌శాఖ డిజిటల్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. రెండేళ్ల క్రితం ఏపీఈపీడీసీఎల్ జిల్లా పరిధిలో డిజిటల్ పేమెంట్లు 30 శాతం ఉండగా ప్రస్తుతం 88 శాతానికి పెరిగాయి.

ప్రయోజనాలివీ..

- విద్యుత్ వినియోగదారులు వారి వద్ద ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా ఏపీఈపీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యుత్ బిల్లులను డిజిటల్ పద్ధతిలో చెల్లించడంతో వినియోగదారుల సమయం ఆదా అవుతుంది.
- విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడే బాధ తప్పుతుంది.
- బిల్లులను నిర్ణీత గడువు లోపు ఎప్పుడైనా, ఎక్కడైనా చేతిలో ఫోన్ ద్వారా చెల్లించవచ్చు.
- ఈ సేవా కేంద్రాల్లో సర్వీస్ ట్యాక్స్ రూపంలో చెల్లించే అదనపు నగదు మిగులుతుంది.
- డిజిటల్ పద్ధతిలో నగదు క్యాష్‌బ్యాక్ పొందే అవకాశం ఉంటుంది.

ఏ యాప్‌ల్లో చెల్లించవచ్చు

విద్యుత్ బిల్లులను డిజిటల్ పద్ధతిలో చెల్లించాలనుకునే వారు ప్రధానంగా గూగుల్ పే డౌన్‌లోడ్ చేసుకుని అందులో ఈపీడీసీఎల్ ఏపీని క్లిక్ చేసి బిల్లులు చెల్లించవచ్చు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే, బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్, గ్రామ, వార్డు సచివాలయ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చు.

విస్తృత ప్రచారం

విద్యుత్ శాఖ డిజిటల్ పేమెంట్లపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేపడుతోంది. డిజిటల్ పేమెంట్లు చేయడం వల్ల కలిగే లాభాలను కరపత్రాల రూపంలో ముద్రించి సిబ్బంది ద్వారా వినియోగదారులకు అందజేస్తున్నారు. ఇప్పటికే అధిక సంఖ్యలో వినియోగదారులు ఆండ్రాయిడ్ ఫోన్లను వినియోగిస్తుండడం, క్షణాల్లో డిజిటల్ పేమెంట్ల ద్వారా చెల్లింపులు జరగడంతో విద్యుత్ వినియోగదారులు కూడా డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యమిస్తున్నారు.



రాయవరం మండలం సోమేశ్వరంలో నాన్ డిజిటల్ విధానంలో క్యూలో నిలబడి నగదు చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు

శత శాతం డిజిటల్ పేమెంట్లు లక్ష్యం



ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు డిజిటల్ విధానంలో జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే వినియోగదారుల్లో అవగాహన పెరిగింది. ఈపీడీసీఎల్ కూడా డిజిటల్ పేమెంట్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. శతశాతం డిజిటల్ పేమెంట్ల లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– విజయానంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రామచంద్రపురం డివిజన్



డిజిటల్ విధానంలో చెల్లింపులు చేయాలంటూ ఈపీడీసీఎల్ కరపత్రం

జిల్లాల వారీగా డిజిటల్, నగదు చెల్లింపులు ఇలా..

తూర్పుగోదావరి

మొత్తం కనెక్షన్లు: 3,24,823
మొత్తం చెల్లింపులు: రూ.4,431.12(లక్షల్లో)
నగదు చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు : 70,183
నగదు రూపేణా చెల్లించే మొత్తం: రూ.908.68 లక్షలు
డిజిటల్ చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 2,54,640
చెల్లించే మొత్తం: రూ.3,522.44 లక్షలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

మొత్తం కనెక్షన్లు: 4,96,020
మొత్తం చెల్లింపులు: రూ.5,831.08 (లక్షల్లో)
నగదు చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 59,973
నగదు రూపేణా చెల్లించే మొత్తం: రూ.738.62 లక్షలు
డిజిటల్ చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 4,36,047
చెల్లించే మొత్తం: రూ.5,092.46లక్షలు

కాకినాడ

మొత్తం కనెక్షన్లు: 5,72,509
మొత్తం చెల్లింపులు: రూ.7,678.64 (లక్షల్లో)
నగదు చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 1,12,372
నగదు రూపేణా చెల్లించే మొత్తం: రూ.1,214.99 లక్షలు
డిజిటల్ చెల్లింపులు చేస్తున్న వినియోగదారులు: 4,60,137
చెల్లించే మొత్తం: రూ.6,463.65లక్షలు

'నన్నయ'లో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలెక్షన్స్



రన్నింగ్‌లో పోటీపడుతున్న విద్యార్థులు

రాజానగరం: జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా విద్యార్థులు సేవాభావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన, విలువలు వంటి మంచి లక్షణాలను అలవర్చుకునే అవకాశం ఉంటుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీ క్రీడా మైదానంలో వెస్ట్‌జోన్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలెక్షన్స్ బుధవారం జరిగాయి. గోదావరి జిల్లాల నుంచి 250 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఈ క్యాంప్‌నకు హాజరై పోటీ పడ్డారు. రన్నింగ్ రేస్, మార్చ్ ఫాస్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని పరేడ్‌కి ఎంపిక చేస్తారు. ఎంపికైనవారు జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే కార్యక్రమంలో 'నన్నయ' యూనివర్సిటీ ఔన్నత్యానికి చిహ్నాలుగా నిలుస్తారని వీసీ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ ఎంపిక చేసిన వారిని ప్రీ ఆర్డీ క్యాంప్‌నకు పంపిస్తామని, అక్కడ కూడా ప్రతిభ కనబర్చిన వారిని ఢిల్లీ క్యాంప్‌కి ఎంపిక చేస్తారన్నారు. ప్రీ ఆర్డీ క్యాంప్ ఈ ఏడాది విజయవాడలో జరుగనున్నదని, అక్కడకు ఏపీతోపాటు ఆరు రాష్ట్రాల నుంచి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కేఎస్ రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీస్ సూపరింటెండెంట్ సంజయ్, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, పీఓలు, పీఈటీలు పాల్గొన్నారు.


హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: తన కుమార్తెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా, ఆ సమయంలో అడ్డు వచ్చిన కుమార్తెపై హత్యాయత్నం చేసినందుకు పదేళ్లు జైలు, రూ.5వేలు జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి బుధవారం తీర్పు చెప్పారు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం కాకినాడకు చెందిన పటాల నాగేశ్వరరావు కుమార్తె దుర్గాభవానీతో పెండ్యాల రవిశంకర్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అయితే 2015లో రామారావుపేట అపార్ట్‌మెంట్‌లో పెండ్యాల రవిశంకర్, దుర్గాభవానీ కలిసి ఉండడంతో రవిశంకర్‌పై కత్తితో నాగేశ్వరరావు దాడి చేయగా మృతిచెందాడు. ఆ సమయంలో దుర్గాభవానీపై కత్తితో దాడి చేయగా తీవ్రగాయాల పాలైంది. దీనిపై మృతుడు భార్య పెండ్యాల అనంతలక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నాగేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు శిక్ష, రూ.10వేలు, కుమార్తె పై దాడి చేసినందుకు పదేళ్ల జైలు,రూ 5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు జరపాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

కంటో పాఠం!



తులసీదాస్



కబీర్ చిత్రం



ఉపాధ్యాయుడు భీమారావు

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు రేవు భీమారావు గురువారం జరగబోయే జాతీయ హిందీ దివస్‌ను పురస్కరించుకుని వినూత్న పద్ధతిలో తన బోధన చేస్తున్నారు. చిత్రకారుడు కూడా అయిన ఆయన స్వయంగా ప్రసిద్ధ హిందీ కవులు తులసీదాస్, కబీర్, సుమిత్రానందన్ పంత్‌ల వర్ణ చిత్రాలను గీశారు. హిందీ పాఠాలను బోధించడానికే పరిమితం కాకుండా ఆ కవుల చిత్రాలను చూపి, వారి సాహిత్య కృషిని విద్యార్థులకు కళ్లకు కట్టినట్టు వివరిస్తున్నారు. భీమారావును పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, సహ ఉపాధ్యాయులు అభినందించారు.



సుమిత్రానందన్ పంత్

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

గండేపల్లి: అనారోగ్యానికి గురైన మనవడికి ఎక్సరే తీయించేందుకు ఆస్పత్రికి వెళుతూ వారే ఆస్పత్రి పాలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కె. నాయకంపల్లికి చెందిన కొల్లు కృష్ణ, కృష్ణవేణిల మనవడికి అనారోగ్యం కారణంగా ఎక్సరే తీయించేందుకు వారిద్దరూ ఒక మోటార్ సైకిల్, మనవడితో వారి బంధువులు మరో మోటార్ సైకిల్‌పై మండల పరిధిలో గల ఎక్సరే సెంటర్‌కు బయలుదేరారు. నీలాద్రిరావుపేట పరిధిలో చక్రవర్తినగర్‌కు వచ్చేసరికి రోడ్డుపై నిలిచిఉన్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో కృష్ణ ముఖానికి, రోడ్డుపై పడ్డ కృష్ణవేణికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న రోడ్డు సేఫ్టీ పోలీస్ వాహన సిబ్బంది వరకుమార్, సతీష్ క్షతగాత్రులను స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో జగ్గంపేటలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరిలో కృష్ణవేణి పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జగ్గంపేట హెచ్‌సీ రామకృష్ణ, కానిస్టేబుల్ రెడ్డి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు గండేపల్లి పోలీసులు తెలిపారు.

'ద్వారక'లోనూ బస్‌స్టాప్ ఏర్పాటు

కాకినాడ: కాకినాడ–విశాఖ మధ్య నడిచే అన్ని నాన్ స్టాప్, ఎక్స్‌ప్రెస్ బస్సులు వైజాగ్ ద్వారక బస్‌స్టేషన్ వద్ద కూడా నిలుపుదల చేస్తామని డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్ చెప్పారు. ప్రస్తుతం కాకినాడ– విశాఖపట్నం మధ్య నడిచే బస్సులు మద్దిలపాలెం బస్‌స్టేషన్ మీదుగా వస్తున్నాయని, ఈ క్రమంలో ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు ద్వారకా బస్‌స్టాప్ వద్ద కూడా నిలుదల చేయాలని నిర్ణయించామన్నారు. మద్దిలపాలెంతోపాటు ద్వారకా బస్‌స్టేషన్ వద్ద కూడా బస్సులు ఆగుతాయని, రిజర్వేషన్ కూడా చేయించుకోవచ్చునన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు



మృతుడు అర్జి నాగేశ్వరరావు (ఫైల్)

కావలి/రాజానగరం: తిరుమలకు బయలుదేరిన వ్యక్తులకు చెందిన ఆటోను లారీ ఢీకొన్న ఘటన బుధవారం కావలి మండలం ముసునూరు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ప్రాంతానికి చెందిన వంట మనిషి అర్జి నాగేశ్వరరావు (59) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ సహా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రాజానగరం మండలం నరేంద్రపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 500 మంది భక్తులు ఆదివారం తిరుమల యాత్రకు సైకిళ్లపై బయలుదేరారు. వీరికి అవసరమైన భోజనం తయారు చేసేందుకు అవసరమైన సరుకులతో ఆరుగురు వ్యక్తులు ఆటోలో బయలుదేరారు. ముసునూరు సమీపంలోకి వచ్చేసరికి ఆటో ప్రమాదానికి గురైంది. మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీ ఆటోను వెనుక వైపు ఢీకొంది. దీంతో ఆటో రోడ్డు పక్కనే ఉన్న పంటకాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నాగేశ్వరరావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ చౌటుపల్లి శ్రీను, ఉల్లి పుల్లయ్య, మారెడ్డి రాంబాబు, తర్రా శీను, గుత్తల రాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తొలుత కావలి ఏరియా వైద్యశాలకు అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కావలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



పంట కాలువలో పడిపోయిన ఆటో

తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే రాజా : ఈ వార్త తెలిసిన వెంటనే విజయవాడలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా ఆ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే సహాయక చర్యలు అందించే ఏర్పాట్లు చేశారు. విషమంగా ఉన్న ఉల్లి పుల్లయ్యను బంధువుల విజ్ఞప్తి మేరకు రాజమహేంద్రవరానికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. మృతుడు అర్జి నాగేశ్వర్రావుకు ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు ఉండగా, వారిలో అమ్మాయిలిద్దరికీ వివాహాలు చేశాడు.

మూడు దశాబ్దాలుగా సాగుతున్న యాత్ర

నరేంద్రపురానికి చెందిన ప్రగడ అంకాలు నియమనిష్ఠలతో దీక్ష చేసి, సైకిలు పై తిరుమలకు వెళ్లి శ్రీనివాసుని దర్శించుకుని వచ్చే కార్యక్రమానికి మూడు దశాబ్దాల క్రితం శ్రీకారం చుట్టారు. రానురాను అతనితోపాటు పయనమయ్యే భక్తుల సంఖ్య గ్రామాలు దాటి పెరుగుతూ వచ్చింది. ఈ విధంగా నరేంద్రపురం, మడికి, కడియపులంక, బుర్రలంక మున్నగు ప్రాంతాల నుంచి సుమారు 500 మంది భక్తులు ఈనెల 10న సైకిళ్ల పై తిరుమలకు పయనమయ్యారు.

చెరువులో బాలుడి మృతదేహం



హోసన్న (ఫైల్)

చాగల్లు: స్థానిక మాతంగి చెరువులో బుధవారం తొమ్మిదేళ్ల బాలుడి మృతదేహం లభ్యమయినట్టు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చెరువులో మృతదేహం తేలిందని స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆ మృతదేహం కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామానికి చెందిన వీరపల్లి హోసన్న(9)గా నిర్ధారించినట్టు తెలిపారు. హోసన్న ఈ నెల 10వ తేదీన చాగల్లులో చర్చికి కుటుంబ సభ్యులతో వచ్చాడు. హోసన్న మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. బాలుడికి మాటలు రావు, ప్రార్థన సమయంలో చర్చి నుంచి బయటికి వచ్చి అదృశ్యం అయ్యాడు. బాలుడి తండ్రి జాన్ రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన కాలేజీ బస్సు.. తప్పిన పెనుముప్పు

రాజోలు: విద్యార్థులు ప్రయాణిస్తున్న ఒక ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీ బస్సు బుధవారం శివకోడులో అదుపు తప్పింది. బ్రేక్ ఫెయిల్ కావడడంతో శివకోడు పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న కొబ్బరితోటలోకి దూసుకుని వెళ్లి ఒక పక్కకు ఒరిగిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 20 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. సఖినేటిపల్లి నుంచి ఓడలరేవులో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలకు బస్సుల్లో వెళ్తున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. బస్సు పక్కకు ఒరిగిపోయిన సమయంలో విద్యార్థులు అత్యవసర ద్వారం నుంచి బయటకు వచ్చారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని రాజోలు ఎస్సై పృథ్వీ తెలిపారు.

బంగారు ధ్వజ స్తంభానికి టేకు చెట్టు ఎంపిక

అన్నవరం: రత్నగిరిపై సత్యనారాయణ స్వామివారి ఆలయంలో కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలోని టేకు వనంలో సుమారు 80 అడుగుల పొడవు గల టేకు చెట్టును దేవస్థానం అధికారులు ప్రాథమికంగా ఎంపిక చేశారు. రౌతులపూడి మండలం ములగపూడికి చెందిన కొరుప్రోలు ఏసుబాబు ఈ టేకు చెట్టును స్వామి వారికి ఉచితంగా అందజేయనున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన దాత ఒకరు స్వామివారికి రూ.3కోట్లతో బంగారు ధ్వజస్తంభం ఏర్పాటుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. గురువారం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్, ఏసీ రమేష్‌బాబు, అటవీశాఖ అధికారులు మారేడుమిల్లిలో టేకు చెట్టును పరిశీలించనున్నారు.



అధికారులు ఎంపిక చేసిన టేకు చెట్టు

టేకు లేదా సోమంచి కర్ర అవసరం

ధ్వజ స్తంభానికి టేకు లేదా సోమంచి కర్ర ఉపయోగిస్తారు. సుమారు 65 అడుగుల పొడవైన కర్ర అవసరం. కొమ్మలు ఉండకూడదు, నిటారుగా పెరగాలి. సోమంచి కర్ర అందుబాటులో లేకపోవడంతో టేకు కర్రను ఎంపిక చేశారు. మారేడుమిల్లిలోని టేకు కర్ర అన్ని విధాలా సరిపోతుందని భావిస్తే ఒకటి రెండు రోజుల్లో అన్నవరం తరలిస్తారు. తరువాత మూడు కిలోల బంగారం రేకుతో తాపడం చేస్తారు. పండితుల వైదిక కార్యక్రమాలతో ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠిస్తారు. వచ్చే జనవరి కల్లా ధ్వజ స్తంభం ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు.

మెజీషియన్ అలీకి కీర్తి పురస్కారం



కీర్తి పురస్కారం అందుకుంటున్న మెజీషియన్ అలీ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన ప్రముఖ మెజీషియన్ అలీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఏటా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి అందించే కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్ తెలుగు విశ్వ విద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ కళా మందిరంలో జరిగిన ఉత్సవంలో తనకు కీర్తి పురస్కారంతో పాటు రూ.5,116 నగదు ప్రోత్సాహం అందించారని అలీ బుధవారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 45 మందిని ఎంపిక చేసి అవార్డులు అందించగా ఇంద్రజాలం రంగం నుంచి తనకు మాత్రమే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ పురస్కారం అందుకోవడం మధురానుభూతిని కలిగించిందని ఆనందం వ్యక్తం చేశారు.